


'ఊరుకున్నంత ఉత్తమం, బోడిగుండంత భోగం' లేద న్నారు.



## గుండుబాధ

ఎవరన్నారోగాని మహా గొప్పగా అన్నారు. నిజంగా ఈ సామెత నిజమో కాదోగాని నాకు గుండుమీద గురి కుదిరింది. దరిమిలా తిరుపతి వెళ్ళినపుడు ఏడుకొండల వాడికి మొక్కిచ్చాను. ఇచ్చాక అనిపించింది. ఇంకేదన్నా మొక్కుకోవాల్సిందని. అంతవరకు భోగం అనుకున్నది, గుండు చేయించుకున్నాక ప్రారంభ మయ్యాయి కష్టాలు.

ముందుగా వేన్నీళ్ళు గుండుమీద పడే టప్పటికి గుండు చుర్రుమంది. ఒకటే మంట. ఇదేం భోగంరా భగవంతుడా అనుకున్నాను. ఆనక ఒళ్ళు తుడుచుకుని అద్దంలో చూసుకుని కెవ్వన కేకేసి మూర్ఛపోయాను. ఆ తర్వాత లేచేటప్పటికి ఎదురుగా మా ఆవిడ కాటేజ్ వరండాలో నిశ్చింతగా చందమామ చదువుకుంటోంది. "పోదురూ బడాయి, గుండు చూసి అంత జడుసుకోవాలా?" అని వెమ్మదిగా దగ్గరికొచ్చి గుండు మీద ఒక్కటిచ్చింది-"ఎంతముద్దుగావుందో గుండు" అంటూ. నాకేం చెయ్యాలో అర్థంకాలేదు. గుక్కపెట్టి ఏడవాలనిపించింది. "ఇంకా ఎన్నిసార్లు ఇలా ముద్దొస్తుంది!?" అని అడిగాను. "ఏమో! ఊసుపోనప్పడల్లా గుండుతో ఆడుకుంటా"నంది. "ఓరి నాయనోయ్! నేనేం చెయ్యన్రోయ్" అని గుండు బాదుకున్నాను.

ఆ తర్వాత కాటేజ్ బయట చాలా గుళ్ళు కలిశాయి. అక్కడినుంచి దర్శనానికి వెళ్ళాం! చెప్పలేనన్ని గుళ్ళు. తెల్ల గుళ్ళు. ఎర్రగుళ్ళు. పచ్చగుళ్ళు. ఈస్ట్‌మన్ కలర్ గుళ్ళు చూస్తూ నా గుండు సంగతి మర్చిపోయాను.

నా అసలు కష్టాలు రాజమండ్రి వచ్చాక మొదలయ్యాయి. రాజమండ్రి మా అత్తారి ఊరు. రిక్షాదిగి చాలా మాఘూలుగా ఇంట్లోకి వెళ్తుంటే మా మరదలు ఎదురొచ్చి "ఏయ్! ఎవరు నువ్వు?" అని ఓ గసురు గసిరింది. ఒక నిమిషం ఆగి "నేను మరదలా!" అన్నాను. వెనక మా ఆవిడ వచ్చింది. అంతే. మా మరదలు కిందపడి దొర్లి దొర్లి నవ్వడం మొదలెట్టింది. నిజం చెప్పొద్దూ నా ప్రాణం చచ్చిపోయింది. గుండు చేయించుకున్నంత మాత్రానికే ఇలా నన్ను అవమానించాలా అనిపించింది. "నీ పరీక్ష గుండై పోను" అని శపించాను మనసులో. "బావా అచ్చం బౌద్ధ బిక్షువులా వున్నావు. కాషాయ బట్టలు కట్టుకోవూ?" అని ముచ్చటపడింది.

"గొప్ప జోకేగాని తిరుపతి మొక్కు అలా అనకూడదు" అన్నాను.

"వస్తే వచ్చావుగాని భలే టైంకి వచ్చావు బావా! సాయంత్రం నా పుట్టినరోజు పార్టీకి నా ఫ్రెండ్స్ వస్తారు. నీ గుండు చూసి వాళ్ళంతా భలే సంతోషిస్తార్లే" అంది ఏదో రవివర్మ బొమ్మచూసి సంతోషించినట్లు.


నా వంటిమీద తేళ్ళు, జెర్రులు పాకినట్లయింది. ఎక్కడికి పారిపోవాలి భగవంతుడా అనుకున్నాను. సరిగ్గా పార్టీ టైంకి బయటపడ్డాను. ఎందుకైనా మంచిది. ఇంటికి ఆలస్యంగా వెళదాం అని ఖాళీగా వున్న సినిమాహాలు చూసి జొరబడ్డాను. సరిగ్గా ఇంటర్వెల్‌కి ఐదు నిమిషాల ముందు నా గుండుమీద పిడుగు పడినట్లయింది. కళ్ళు బైర్లు కమ్మినయ్! "ఓరి సుబ్బిగా! సినిమాకి వచ్చావా!?" అన్న డైలాగు వినిపించింది. అప్పుడర్థమయింది. నన్నెవడో కొట్టాడని. నన్ను చూసి పొరపాట్న వాడి స్నేహితుడను కొన్నాడని తర్వాత వాడు సారీచెప్పి వెళ్ళి దూరంగా కూర్చున్నాడు. వీడెవడో పందెం కాసి నా గుండుని బావబాది వుంటాడుకాని. పొరపాటుమాత్రం కాదు అన్న అనుమానం నాకొచ్చింది. ఇలా ఇంకా వీడెన్నిసార్లు కొడతాడో అని సినిమా హాలునుంచి బయటపడ్డాను.

అప్పుడే ఇంటికి వెళ్దామా అంటే మా మరదలు. వాళ్ళ బెటాలియన్ గుర్తొచ్చారు. సినిమాహాల్లో కూర్చుందామంటే పందెంగాడు గుర్తొచ్చాడు. అలా రోడ్డుమీద తిరిగి సెకండ్‌షోకి వెళ్దాం అని నిశ్చయించుకుని మెయిన్‌రోడ్‌లోకి వచ్చాను. ఒక టోపీలవాడు వెంటపడ్డాడు. వద్దురా అంటే వినడు. "అసహ్యంగా గుండుతో ఎలా తిరుగుతారు సార్" అన్నాడు. ఎక్కడలేని చావొచ్చింది ఈ గుండుతో అని వాపోయి సెకండ్ షో సినిమాకెళ్ళి హాల్లో కూర్చున్నాను. ఆట మొదలెట్టిన అరగంటకి వెనకనించి వేరుసెనక్కాయలు గుండును ముద్దెట్టుకోటం మొదలెట్టాయి. వెనక్కి తిరిగి చూద్దునుకదా. మా మరదలు తన పటాలంతో అదే సినిమా కొచ్చింది.

-ఇందిరా రమణ

---

విహారు కేంప్‌కి వెళ్ళిన ఈ రెండు రోజులు చాలా తీవ్రంగా ఆలోచించాను.



మీరు చెప్పినదానికి కాంప్రమైజ్ కాలేకపోతున్నాను. కావడం నావల్లకాదని దృఢంగా చెబుతున్నాను. ఒకానొక పరిస్థితికి బానిస నయిపోయాను అన్నారు. అది మీ బలహీనత. మీతో యికపై కలలవుండలే నన్నది నా బలహీనత. నా బసి